మరో ప్రజా సంకల్పం

Maro Praja Sankalpam • Main Edition



2024 సార్వత్రిక ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో అసలేం జరిగింది? ప్రజలకు పెద్దఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేసిన వైయస్ జగన్ నేతృత్వంలోని వైయస్సార్‌సీపీ కేవలం 11 అసెంబ్లీ స్థానాలకే ఎలా పరిమితమైంది? ఎన్నికల ఫలితాలు వెలువడిన నాటి నుంచి వినిపిస్తున్న ఈ ప్రశ్నలకు.. ఇప్పుడు పోలింగ్ శాతాల్లో నమోదైన వ్యత్యాసాలు, అర్ధరాత్రి భారీగా ఓట్లు నమోదయ్యాయన్న విశ్లేషణలు, వీవీప్యాట్ స్లిప్పుల లెక్కింపుపై డిమాండ్లు, ఈవీఎంలపై వ్యక్తమవుతున్న సందేహాలు మరింత బలపరుస్తున్నాయి. సీఈసీ జ్ఞానేష్ కుమార్ ను తొలగించాలని దేశ వ్యాప్తంగా యువత ఉద్యమిస్తున్న నేపథ్యంలో ఏపీలో ఓటు చోరీ చర్చనీయాంశంగా మారింది. పలువురు మేధావులు, రాజకీయ నాయకులు, ప్రజలు సైతం దీనిపై పెద్ద ఎత్తున చర్చించుకుంటున్నారు.

ఏపీలో ఓటు చోరీ నిజమే!

ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, మేధావులు, నాయకుల మాట ఇదే

- 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైయస్సార్ సీపీ ఓటమిపై అన్నీ అనుమానాలే
- ప్రజలకు మేలు చేసిన జగన్ కు 11 సీట్లేంటని నాడే ఓటర్లు సందేహాలు
- గెలిచింది బాబు కాదు... జగనేనన్న వీపీఎం నేత తమ్మినేని వీరభద్రం
- అర్ధరాత్రి ఓట్ల మాయాజాలంపై నిత్యం నిలదీస్తున్న వరకాల ప్రభాకర్
- ఏపీ ఎన్నికల్లో కుట్రపై వాస్తవాలు బయటపెడతానన్న ప్రకాష్ రాజ్
- పోలింగ్ శాతం 68.04 నుంచి 80.66కు ఎలా పెరిగింది: ప్రొ.నాగేశ్వర్
- ఫలితాలు, పోలైన ఓట్ల వ్యత్యాసాలపై 'ది వైర్' పరిశోధనాత్మక కథనం
- వీవీప్యాట్ స్లిప్పులను ఎందుకు లెక్కించరు?: ఉండవల్లి అరుణ్ కుమార్
- సుమారు 48 లక్షల ఓట్లు (12.5%) వ్యత్యాసం ఉందన్న వైయస్ జగన్
- ఈవీఎంలపై ప్రజల అనుమానాలు తీసిపారేయలేం: ఎస్.వై.ఖురేషీ
- వీవీప్యాట్ స్లిప్పులు, ఓటింగ్ శాతం, అదనంగా ఓట్లు, ఈవీఎంల చార్జింగ్, సీసీటీవీ ఫుటేజీ.. జవాబులేని ప్రశ్నలెన్నో!
- ఎస్ఐఆర్ పేరిట లక్షలాది ఓట్ల తొలగింపుపైనా సందేహాలెన్నో.. తేల్చే నాథుడేడీ?
- సీఈసీపై ఆరోపణలతో మొత్తం ఎన్నికల ప్రక్రియపైనే సందేహాలు
- ఈవీఎంల ట్యాంపర్ జరిగిందని, బ్యాలెట్ పద్ధతి పెట్టాలని సర్వత్రా డిమాండ్లు

ప్రముఖులందరి నోటా అదే మాట..

'నాడు గెలిచింది చంద్రబాబు కాదు.. జగనే' అంటూ సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం చేసిన వ్యాఖ్యలు.. అర్ధరాత్రి పోలింగ్ లెక్కలపై రాజకీయ విశ్లేషకుడు వరకాల ప్రభాకర్ లేవనెత్తిన ప్రశ్నలు.. పోలింగ్ శాతం 68.04 నుంచి 80.66కు ఎలా పెరిగిందో ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలన్న ప్రొఫెసర్ నాగేశ్వర్ వాదన.. వీవీప్యాట్ స్లిప్పులను ఎందుకు లెక్కించరన్న ఉండవల్లి అరుణ్‌కుమార్ ప్రశ్న.. సుమారు 48 లక్షల ఓట్లు, అంటే 12.5 శాతం ఓట్ల విషయంలో వ్యత్యాసం ఉందన్న వైయస్ జగన్ ఆధారాలతో చేసిన ఆరోపణ.. ఏపీ ఎన్నికలపై తనకూ అనుమానాలున్నాయని, పరిశోధన చేస్తున్నానన్న ప్రకాష్‌రాజ్ వ్యాఖ్యలు.. ఇలా ఒక్కొక్కటిగా తెరపైకి వస్తున్న అంశాలు 2024 ఎన్నికల ప్రక్రియపై కొత్త చర్చకు దారితీస్తున్నాయి.

చరిత్రలో కనీవినీ ఎరుగని అభివృద్ధి చేసినా..

ఏపీలో 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఓటు చోరీ జరిగింది.. అందుకే వైయస్సార్ సీపీకి కేవలం 11 సీట్లు మాత్రమే వచ్చాయనే వాదన రోజు రోజుకూ బలం పుంజుకుంటోంది. 2019 ఎన్నికల్లో 151 అసెంబ్లీ సీట్లను గెల్చుకుని అధికారంలోకి వచ్చి.. దేశంలోనే ఏ రాష్ట్రంలోనూ జరగనంత అభివృద్ధి, సంక్షేమం ఇచ్చిన వైయస్సార్ సీపీకి ఇలాంటి ఫలితాలు రావడం వెనుక ఉన్న కుట్రలు బద్దలయ్యే సమయం సమీపిస్తోంది. ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, మేధావులు, రాజకీయ నాయకులు సైతం ఏపీలో వాస్తవంగా వైయస్సార్ సీపీనే గెలిచిందని.. ఓటు చోరీతో ఫలితాలు తారుమారయ్యాయని బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. సీఈసీ పై తాజాగా వచ్చిన ఆరోపణలతో ఏకంగా ఎన్నికల ప్రక్రియపైనే సందేహాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఏపీతో సహా దేశంలోని పలు రాష్ట్రాల్లో ఓట్ల చోరీపై ప్రజలు, మేధావులు గళం విప్పుతున్నారు. ప్రజలు తమ పవిత్రమైన ఓటు హక్కుతో ఎన్నుకోవాలనుకున్న పార్టీని, నేతలను కాకుండా.. ప్రజాబలం లేని పార్టీని.. అసమర్ధ నేతలను అడ్డదారిలో గద్దెనెక్కించడం రాజ్యాంగ బద్ధంగా జరగాల్సిన ఎన్నికల ప్రక్రియను, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే. వివిధ వేదికలు, సామాజిక మాధ్యమాల్లో ఓటు చోరీపై నాయకులు, విశ్లేషకులు ఏమన్నారో ఒకసారి పరిశీలిద్దాం..